క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నాదెండ్ల: సాతులూరు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో శనివారం మరమ్మతుల దృష్ట్యా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని డీఈఈ ఆర్ అశోక్‌కుమార్ తెలిపారు. ఉదయం 6.30 గంటల నుంచి 10.30 గంటల వరకూ సబ్‌స్టేషన్ పరిధిలో సాతులూరు, చందవరం, పానుగుపాడు, దొండపాడు, డెయిరీ ఇండస్ట్రీ, జ్యోతిర్మయి టెక్స్‌టైల్స్, సాతులూరు ఇండస్ట్రీస్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

నేడు పెన్షన్ల పంపిణీ

నాదెండ్ల: మండలంలోని 16 సచివాలయాల పరిధిలో శనివారం వైఎస్సార్ పెన్షన్ కానుక సామాజిక భద్రతా పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీవో జాకీర్ హుస్సేన్ తెలిపారు. మొత్తం 9659 పెన్షన్లకు గాను రూ.2,86,49,000లు పంపిణీ చేయాల్సి ఉందన్నారు. ఇందులో 2440 మందికి బ్యాంకు ఖాతాల్లో జమచేస్తామన్నారు. మిగిలిన 7219 మందికి నేరుగా సచివాలయ సిబ్బంది లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

2 నుంచి 5 తేదీ వరకు వ్యాపార సంస్థలు మూసివేయాలి

వినుకొండ రూరల్ సీఐ సుధాకరరావు


శావల్యాపురం: సార్వత్రిక ఎన్నికల లెక్కింపు సందర్భంగా ఎస్పీ మల్లికాగార్గ్ ఆదేశాలు మేరకు రూరల్ మండలాల పరిధిలో అన్నీ గ్రామాల్లో రేపటి నుంచి 5 తేదీ వరకు వ్యాపార సంస్థలు మూసివేయాలని సీఐ ఉప్పుటూరి సుధాకరరావు తెలిపారు. శుక్రవారం స్థానిక పోలీసు స్టేషను సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 144 సెక్షన్ అమల్లో ఉందని తద్వారా ఓట్లు లెక్కింపు పురస్కరించుకుని శాంతి భద్రతలకు విఘాతం కలుగకుండా ఉండటానికి వ్యాపార సంస్థలు మూతవేయాలన్నారు. అత్యవసరమైన పాలు, పెరుగు, కూరగాయలు, మెడికల్ దుకాణాలు మినహాయించి మిగిలిన వ్యాపార సముదాయాలన్నీ పూర్తిస్థాయిలో మూతవేయాలన్నారు.

నేటి నుంచి ప్రసన్నాంజనేయుని జయంత్యుత్సవాలు



బెల్లంకొండ: మండలంలోని బెల్లంకొండ క్రాస్ రోడ్డు వద్ద గల కోళ్లూరి ప్రసన్నాంజనేయ స్వామి వారి జయంత్యుత్సవాలు ఈ నెల 1 నుంచి 3వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ మర్రి ప్రసాదరెడ్డి తెలిపారు. రాష్ట్రంలోని ప్రముఖ దేవాలయాలలో ఒకటిగా ఈ ఆలయం ఉంది. పులిచింతల ప్రాజెక్టు ముంపు గ్రామమైన కోళ్లూరు నుంచి గత పది సంవత్సరాల క్రితం స్వామి వారిని బెల్లంకొండ క్రాస్ రోడ్డు వద్దకు తరలించారు. ప్రతి సంవత్సరం లాగానే ఈ ఏడాది కూడా స్వామి వారి కల్యాణ వేడుకలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. శనివారం ఉదయం ఆరు గంటలకు రామ నామ సంకీర్తనతో పూజ కార్యక్రమాలు ప్రారంభం కానున్నాయని ఆలయ అర్చకులు నరసింహాచార్యులు తెలిపారు. 7 గంటలకు విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, అభిషేకాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం దీక్ష స్వాములకు ఇరుముడి కార్యక్రమం, సాయంత్రం నాలుగు గంటలకు కోలాటం, 6 గంటలకు వైఖానస శాస్త్రానుసారంగా సువర్చల సహిత ప్రసన్నాంజనేయస్వామి వారి కల్యాణ వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 2వ తేదీన ఉదయం సుప్రభాత సేవ, ఆకు పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నారు. అనంతరం తీర్థప్రసాద వినియోగము, కోలాట కార్యక్రమాలు ఉన్నట్లు తెలిపారు. 3వ తేదీన ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఉన్నట్లు తెలిపారు. అదే విధంగా ఉత్సవాల సందర్భంగా మూడు రోజుల పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

మగ్గం వర్క్‌లో మహిళలకు సర్టిఫికెట్లు



సత్తెనపల్లి: దళిత బహుజన రిసోర్స్ సెంటర్, యూనియన్ బ్యాంక్ వారి ఆధ్వర్యంలో సత్తెనపల్లి మండలం కంటెపూడి గ్రామంలోని కమ్యూనిటీ హాల్‌లో మహిళల స్వయం ఉపాధికై మగ్గం వర్క్‌పై తర్ఫీదు ఇచ్చారు. 30 రోజుల పాటు ఈ తర్ఫీదు పొందిన మహిళలకు శుక్రవారం సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. దళిత బహుజన రిసోర్స్ కోఆర్డినేటర్ మేడే వెంకటరమణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో యూనియన్ బ్యాంక్ డైరెక్టర్ బ్రహ్మానందం కుమార్ మాట్లాడుతూ మహిళలు వారి కుటుంబ అభివృద్ధికి తోడ్పడే విధంగా వారి జీవనోపాధిని మెరుగుపరుచుకొని కుటుంబానికి సహాయంగా ఉండాలన్నారు. ఫ్యాకల్టీ రాజశేఖర్ మాట్లాడుతూ యూనియన్ బ్యాంక్ సహాయంతో చిన్న చిన్న యూనిట్లు పెట్టుకొని కావలసిన మెటీరియల్స్‌కు త్వరలో బ్యాంకు ద్వారా లోన్ ఇప్పించి వారి జీవనోపాధికి తోడ్పడాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టి పూర్తి చేయడం జరిగిందన్నారు. అనంతరం సర్టిఫికెట్లు అందజేశారు.

వరుణుడొస్తున్నాడనీ..

- పొలాలకు సేంద్రియ ఎరువు
- పనుల్లో నిమగ్నమైన రైతన్నలు



పశువుల పేడను పొలాలకు తొలుతున్న రైతులు

శావల్యాపురం: వాతావరణంలో రుతుపవనాలు ప్రారంభం అవుతున్నాయని వాతావరణ శాఖ అధికారులు సమాచారం మేరకు ఈ ఏడాది ఖరీఫ్ సీజను సాగుకు అన్నదాతలు సమాయాత్తం అవుతున్నారు. దీంతో రైతులు పశువుల పేడను పొలాల్లో తొలుకునే పనుల్లో నిమగ్నం అయ్యారు. పంటకు ప్రయోజనంతో పాటు పెట్టుబడులు తగ్గి దిగుబడులు ఆశించిన స్థాయిలో వస్తాయని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. దీంతో రైతులు సేంద్రియ ఎరువుల వైపు ఆసక్తి చూపుతున్నారు. సేంద్రియ ఎరువులు వినియోగం దపాలు వారీగా వినియోగిస్తే భూమిలో పోషకాలు శాతం పెరిగి భూసారం కూడా మరింత అభివృద్ధి చెంది పంట దిగుబడికి దోహదపడుతుంది. ఒక్కో ఎకరానికి నాలుగు నుంచి ఐదు ట్రాక్టర్లు పశువుల పేడను ఎరువుగా ఉపయోగిస్తున్నారు. దీనిలోని సహజ సిద్ధ లవణాలు పంటకు లాభపడతాయి. భూమిలో ఉన్న అమ్లాలు, క్షారాల స్థాయిని నిలబెడతాయి. నేలలోని సూక్ష్మ జీవుల వృద్ధికి తోడ్పడుతుంది. అన్నీ రకాల పోషకాలు తయారు అవుతాయి. రైతుభరోసా కేంద్రాల్లో రాయితీపై సేంద్రీయ ఎరువులు తయారి కోసం జనుము పిల్లిపెసర, జిలగలు, తదితర విత్తనాలను మంజూరు చేస్తుందని మండల వ్యవసాయ అధికారి పల్లపోతుల ప్రవీణ్ శుక్రవారం తెలిపారు.

ఘనంగా సూపర్‌స్టార్ కృష్ణ జయంతి



వృద్ధులకు అన్నదానం చేస్తున్న కృష్ణ అభిమానులు

నరసరావుపేట: స్థానిక రెడ్డికాలేజి వెనుక ఉన్న పెద్దచెరువు 9వ లైనులో సెయింట్ థెరిస్సా ఛారిటబుల్ ట్రస్ట్ వృద్ధుల ఆశ్రమంలో పల్నాడు జిల్లా–టౌన్‌వైడ్ సూపర్‌స్టార్ కృష్ణ, మహేష్‌బాబు యువశక్తి పట్టణ అధ్యక్షులు షేక్ ఫారూఖ్‌బాబు ఆధ్వర్యంలో శుక్రవారం సూపర్‌స్టార్ కృష్ణ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా కేక్ కట్ చేసి అక్కడి వృద్ధులు, అభిమానులకు పంచిపెట్టారు. అనంతరం వారికి అన్నదానం చేశారు. కృష్ణ జ్ఞాపకంగా పట్టణంలో ఒక విగ్రహాన్ని వీలైనంత త్వరగా ఏర్పాటు చేస్తామని ఫరూక్‌బాబు వెల్లడించారు. అభిమానులు పి.వెంకటరావు, పద్మాలయ వేణు, బి.కొండలరావు, అంజనేయులు పాల్గొన్నారు.

నేటి నుంచి మండలంలో 144 సెక్షన్

రొంపిచర్ల: ఎన్నికల కౌంటింగ్ దృష్ట్యా ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా మండలంలో శనివారం సాయంత్రం 5 గంటల నుండి మంగళవారం వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందని రొంపిచర్ల ఎస్ఐ కె.పి. రవీంద్ర తెలిపారు. పల్నాడు జిల్లా ఎస్పీ మలికా గార్గ్ ఆదేశాల మేరకు 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో షాపులు మూసివేస్తారన్నారు. మండల ప్రజలు తమకు అవసరమైన నిత్యావసర వస్తువులను ముందుగానే సమకూర్చుకోవాలన్నారు. ఎవరైనా చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే వారిపై కేసు నమోదు చేసి కఠినంగా శిక్షిస్తామన్నారు. అందరూ గొడవలకు దూరంగా ఉండాలని హెచ్చరించారు. ఊరేగింపులు, బాణసంచా మోతలను నిషేధమన్నారు.

అనుమతుల్లేవు.. అతిక్రమించకండి

పోలీసు వారి హెచ్చరిక

యడ్లపాడు: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో శనివారం సాయంత్ర 5 గంటల నుంచి యడ్లపాడు మండలంలో 144 సెక్షన్ అమల్లో ఉంటుందని ఎస్ఐ జె శామ్యూల్ రాజీవ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల నేపథ్యంలో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మండలంలో 144 సెక్షన్‌ను అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. మండల ప్రజలు ముందస్తుగానే తమకు కావాల్సిన నిత్యావసర సరుకులను సమకూర్చుకోవాలని తెలిపారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు ఎవరైనా పాల్పడితే వారిపై కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షిస్తామని కావున ప్రతి ఒక్కరు గొడవలకు దూరంగా ఉండాలని హెచ్చరించారు. పోలీసుల శాఖ వారికి సహకరించి వివాదాలకు దూరంగా ఉండాలని కోరారు. అలాగే సోషల్ మీడియా, వాట్సప్, ఇన్‌స్టాగామ్‌లలో శనివారం వెలువడే ఎగ్జిట్ పోల్స్ తరువాత ఎటువంటి విద్వేషాలు రెచ్చగొట్టే పోస్టులు పెట్టరాదన్నారు. ఎవరైనా అటువంటి సందేశాలు, ఫొటోలు, వీడియోలు పోస్టు చేసినట్లయితే సదరు గ్రూప్ అడ్మిన్ పూర్తి బాధ్యత వహించాల్సి ఉందన్నారు. అటువంటి వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోబడునని హెచ్చరించారు. శనివారం అంతటా జరుపుకునే హనుమజ్జయంతి సందర్భంగా ఎలాంటి ర్యాలీలు, మైకులు, సాంస్కృతిక కార్యక్రమాలకు అనుమతి లేదన్నారు. ఆలయాల్లో మాత్రమే స్వామి వారికి భక్తులు పూజలు నిర్వహించుకోవాలని, ఇందుకు పోలీసు వారితో సహకరించాలని కోరారు.

పోలీసు ఆంక్షల మేరకు నడుచుకోవాలి

నాదెండ్ల: ఈ నెల 4న సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో మండలంలో 144 సెక్షన్ అమల్లో ఉంటుందని ఎస్సై జె బలరామ్‌రెడ్డి తెలిపారు. ప్రజలు గుంపులు గుంపులుగా ఉండవద్దని, నలుగురికి మించి ఉంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాజకీయ ఉద్రిక్తతలు నెలకొనే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరూ ఇళ్ళకే పరిమితం కావాలని సూచించారు. కౌంటింగ్ రోజు అల్లర్లు, గొడవలకు దిగి జీవితాలను పాడు చేసుకోవద్దన్నారు. ఈ నెల 1 నుండి 5వ తేదీ వరకూ అన్ని దుకాణాలు స్వచ్ఛందంగా మూసివేసి పోలీసులకు సహకరించాలని కోరారు.

దాడికి ఉసిగొల్పిన భూవివాదం

నాదెండ్ల: భూవివాదం నేపథ్యంలో మహిళపై సమీప బంధువులు దాడి చేసి గాయపరిచిన సంఘటన మండల కేంద్రమైన నాదెండ్ల గ్రామంలో శుక్రవారం వెలుగులోకొచ్చింది. బాధితురాలు బత్తుల శాంతమ్మ తెలిపిన వివరాల మేరకు తన తండ్రి వలేరు సుబ్బారావు 2002 జూన్‌లో రూ.20 వేలకు 28.5 ఎకరాల భూమి తనకు విక్రయించగా, తాను కొనుగోలు చేసి తన పేరిటకు రాయించుకున్నట్లు తెలిపారు. అయితే తన తండ్రి సమీప బంధువులు ఈ భూమి నీకు అమ్మలేదు, ఆ సంతకాలు మావి కాదంటూ నెల నుంచి వేధింపులకు గురిచేస్తున్నారన్నారు. మూడు రోజుల క్రితం పొలంలో పనులు చేసేందుకు తాను వెళ్లగా సమీప బంధువులు దాడి చేసి తనచేయి విరగ్గొట్టారని వాపోయింది. తాను చిలకలూరిపేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స చేయించుకుంటున్నానన్నారు. దీనిపై పోలీసులు, రెవెన్యూ అధికారులు స్పందించటం లేదని వాపోయింది.

యడ్లపాడులో మరోసారి చోరీకి యత్నం



చోరీ చేసేందుకు ముసుగుతో వచ్చిన యువకుడు

యడ్లపాడు: వరుసగా దొంగల గ్రామంలో హల్‌చల్ చేయడంతో యడ్లపాడు గ్రామస్తులు బెంబేలెత్తు తున్నారు. సరిగ్గా వారం రోజులు కిందట మాదిరిగానే గ్రామంలోని మరోదుకాణంలో గుర్తు తెలియని దుండగుడు చోరీ విఫలయత్నం చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని హైవే సర్వీసు రోడ్డులో ఉన్న గాండ్ల శ్రీనివాస్ సెల్ షాపు దుకాణం ఉంది. రోజు మాదిరిగానే బుధవారం రాత్రి షాపుకు తాళాలు వేసి ఇంటికి వెళ్లాడు. మర్నాడు ఉదయం షాపు తెరిచేందుకు వచ్చి చూడగా షట్టర్‌కు వేసిన తాళాలు పగుల గొట్టి పక్కన పడి ఉన్నాయి. అనుమానంతో దుకాణంలోని సీసీ కెమెరా పుటేజీలను పరిశీలించాడు. ముందురోజు రాత్రి 1.15 గంటలకు ముఖానికి మాస్క్, టీ షర్టు ధరించిన యువకుడు రాడ్డుతో వచ్చి సీసీ కెమెరాను పక్కకు నెట్టి తాళాల్ని పగులగొట్టాడు. ఇంతలోనే రోడ్డుపై వాహనాలు రావడాన్ని గమనించి అక్కడ నుంచి ఉడాయించాడు. ఇదే తీరున వారం కిందట సరుకుల దుకాణంలోనూ జరిగడంతో వ్యాపారులు, జనం భయాందోళనలకు గురవుతున్నారు. వరసగా ఒకే తీరున చోరీ యత్నం జరగడంపై పోలీసులు ప్రత్యేక దృష్టిని సారించాల్సిన అవసరం ఎంతైన ఉంది.

బస్టాండ్‌లో వృద్ధుడి మృతి



చిలకలూరిపేటటౌన్: గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందిన సంఘటన పట్టణంలో శుక్రవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని ఆర్టీసీ బస్‌స్టాండిగ్‌లోని 10 నంబర్ ఫ్లాట్‌ఫారంపై శుక్రవారం సాయంత్రం 3.30 గంటలకు ఓ వృద్ధుడు సొమ్మసిల్లి పడి ఉండటాన్ని ప్రయాణికులు గమనించారు. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న 108 వాహన సిబ్బంది అతన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షలు నిర్వహించిన వైద్యులు వృద్ధుడు అప్పటికే మృతి చెందినట్లు ధృవీకరించారు. అర్బన్ పోలీసులు ప్రాథమిక విచారణలో భాగంగా గుర్తు తెలియని వ్యక్తిగా కేసు నమోదు చేసుకున్నారు. మృతి చెందిన వ్యక్తికి 55 ఏళ్ల పైబడి వయస్సు ఉంటుందని, వంటిపై తెల్లచొక్క, నల్లప్యాంట్ ధరించాడని, తల, గడ్డం మీసాలు పూర్తిగా తెల్లబడి ఉన్నాయన్నారు. మృతుడి చొక్క కాలర్‌పై మంగళగిరికి చెందిన అజయ్ టైలర్ లేబిల్ ఉంది. జేబులోని ప్యాకెట్ పుస్తకంలో వి సాయి మానిష్, రెండో టాట్, పేజ్ ఇంజనీరింగ్ 23కెక్యూ5ఏ 4702 అడ్రస్ రాసి ఉన్నదని పోలీసులు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు చిలకలూరిపేట అర్బన్ పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని కోరారు.

అధిక ధరకు విత్తనాలు విక్రయిస్తే చర్యలు



విత్తన దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న ఏడీఏ మస్తానమ్మ

నరసరావుపేట రూరల్: విత్తనాలను అధిక ధరకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఏడీఏ పి.మస్తానమ్మ తెలిపారు. పట్టణంలోని విత్తన దుకాణాల్లో శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. దుకాణాల్లో స్టాకును, రసీదు పుస్తకాలను పరిశీలించారు. పత్తి విత్తనాలను ఎంఆర్‌పి ధరలకే విక్రయించాలని, అధిక ధరలకు విక్రయిస్తే దుకాణాలపై చర్యలు తప్పవని హెచ్చరించారు. విత్తనాలు విక్రయించిన సమయంలో రైతులకు రసీదు తప్పని సరిగా ఇవ్వాలని స్పష్టం చేశారు. దుకాణంలో విత్తన నిల్వ సమాచారం తెలిసే విధంగా నిల్వ పట్టికను బోర్డులో ఏర్పాటు చేయాలని ఆదేశించారు. బోర్డు ఏర్పాటు చేయకుంటే విత్తన లైసెన్స్‌లు రద్దు చేస్తామని హెచ్చరించారు.

యడ్లపాడులో హనుమజ్జయంతి వేడుకలు



యడ్లపాడు రణ వీరాంజనేయస్వామికి లక్షదళార్చన చేసిన దృశ్యం



సామూహిక పూజల్లో పాల్గొన్న భక్తులు

యడ్లపాడు: హనుమాన్ జయంతిని పురస్కరించుకుని యడ్లపాడు గ్రామంలోని రణవీరాంజనేయ స్వామి దేవస్థానంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు జంధ్యాల శ్రీరామచంద్రమూర్తి ఆధ్వర్యంలో గణపతిపూజ, పంచామృత అభిషేకాలు, లక్ష తమలపాకులతో అర్చన గావించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తులకు వివిధ రకాల ప్రసాదాలను పంపిణీ చేశారు.

ప్రపత్తి ఆంజనేయస్వామి ఆలయంలోనూ...

ఇదే గ్రామంలోని మెయిన్ బజారులో చిన్న ఆంజనేయస్వామిగా ప్రసిద్ధి చెందిన ప్రపత్తి ఆంజనేయ స్వామి ఆలయంలోనూ స్వామివారికి అభిషేకాలు, విశేష అలంకరణ, అర్చనలు జరిగాయి. సామూహిక పూజల్లో ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులతో పాటు భక్తులు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా కోటేశ్వరమ్మ

సత్తెనపల్లి: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఉపసర్తి కోటేశ్వరమ్మను నియమించారు. ఇప్పటి వరకు ఇక్కడ ప్రిన్సిపాల్‌గా పనిచేసిన జెడ్‌ఎస్ రామచంద్రరావు శుక్రవారం పదవీవిరమణ చేశారు. దీంతో సీనియర్ ఫిజిక్స్ అధ్యాపకురాలైన ఉపసర్తి కోటేశ్వరమ్మకు ప్రిన్సిపాల్‌గా అవకాశం కల్పించారు. శనివారం ఆమె ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ సందర్భంగా పలువురు అధ్యాపకులు శుక్రవారం ఆమెకు అభినందనలు తెలిపారు.

ముందు వెళ్తున్న లారీని ఢీకొట్టిన మరోలారీ

ఢీకొట్టిన లారీ డ్రైవర్‌కు గాయాలు



చిలకలూరిపేటటౌన్: నిద్రమత్తుతో ముందు వెళుతున్న లారీని మరో లారీ ఢీకొన్ని సంఘటన శుక్రవారం మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...విజయవాడ నుంచి నెల్లూరు వెళ్తున్న వెళుతున్న లారీ రూరల్ మండలంలోని తాతపూడి గ్రామం హైవే వద్దకు రాగానే డ్రైవర్‌కు నిద్ర ఆవహించింది. దీంతో ముందు వెళ్తున్న లారీని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఢీకొట్టిన లారీ ముందుభాగం ధ్వంసం కాగా, ఆ లారీ డ్రైవర్ గంథం భోగేశ్వరరావుకు గాయాలయ్యాయి. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న చిలకలూరిపేట 108 సిబ్బంది సంఘటనా స్థలాన్ని చేరుకుని బాధితుడిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నేడు హనుమజ్జయంతి వేడుకలు



ఎండుగుంపాలెం అక్కాయకుంట వీరాంజనేయ స్వామి వారికి ప్రత్యేక పూజలు





గణపవరంలో స్వామివారికి తమలపాకులతో ఆకుపూజ , 1116 లడ్డూలతో అభిషేకం

నాదెండ్ల: హనుమత్ జయంతిని పురస్కరించుకుని మండలంలోని అన్ని గ్రామాల్లో ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం హనుమత్ జయంతి పర్వదినాన్ని పురస్కరించుకుని మూడు రోజులుగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా గణపవరంలో నూతనంగా నిర్మించిన రామాలయంలో ఆలయ అర్చకులు దర్బి ఉమామహేశ్వర శర్మ, అనిల్‌కుమార్‌లు స్వామి వారిని అలంకరించి పూజలు నిర్వహించారు. 1116 లడ్డులు, తమలపాకులతో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు. గణపవరం–కావూరు డొంకరోడ్డులో కొలువైయున్న వీరాంజనేయస్వామి ఆలయంలో లక్ష్మీనారాయణ శర్మ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు స్వామివారి జెండాను సాంప్రదాయబద్ధ మేళతాళాలతో గ్రామోత్సవం నిర్వహించారు. గణపవరంలోని శాంతినగర్ కోదండ రామాలయంలో గత మూడు రోజులుగా స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎండుగుంపాలెంలో కొలువైయున్న అక్కాయకుంట సువర్చలా సమేత ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో ఏకనామం, ఆకుపూజ, అభిషేకాలు నిర్వహించారు. శనివారం ఉదయం ప్రత్యేక పూజల అనంతరం అన్నదానం చేయనున్నారు.

తాగునీటి సరఫరా పునరుద్ధరించండి

పైపులైను లీకు మరమ్మతు పనులను పరిశీలించిన కమిషనరు



పనులను పరిశీలిస్తున్న కమిషనరు, ఇంజనీరింగ్ అధికారులు

నరసరావుపేట: పట్టణానికి మంచినీటి సరఫరా చేసే పైప్‌లైను లీకు మరమ్మతు పనులను త్వరగా పూర్తిచేసి సరఫరా పునరుద్ధరించాలని మున్సిపల్ కమిషనర్ సి.రవిచంద్రారెడ్డి ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం శాంతినగర్ నుంచి పట్టణానికి తాగునీరు అందించే పైపు లైనుకు రావిపాడు రోడ్డులో ఏర్పడిన లీకు పనులను పరిశీలించారు. రేపు సాయంత్రం లేదా ఎల్లుండి ఉదయం ఎట్టి పరిస్థితుల్లో పట్టణ ప్రజలకు మంచి నీరు అందే విధంగా చూడాలని కోరారు. మున్సిపల్ డిప్యూటీ ఇంజనీర్ ఓలేటి శ్రీనివాసరావు, అసిస్టెంట్ ఇంజనీర్ రాములునాయక్ పాల్గొన్నారు.

జనవిజ్ఞాన వేదిక నిర్మాణానికి విరాళం



విరాళాన్ని అందజేస్తున్న దాత బోయపాటి వెంకట రాయుడు

శావల్యాపురం: జనవిజ్ఞాన వేదిక ఇతర ప్రజాసంఘాల వారి సారథ్యంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న పల్నాడు విజ్ఞాన కేంద్రం నిర్మాణానికి దాత సహకారం అభినందనీయమని రాష్ట్ర ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం అధ్యక్షులు వి.కృష్ణయ్య అన్నారు. శుక్రవారం పల్నాడు జిల్లాలో నూతనంగా విజ్ఞాన కేంద్రం నిర్మాణానికి శావల్యాపురం మండలం వేల్పూరు గ్రామానికి చెందిన బోయపాటి వెంకట రాయుడు తన వంతు విరాళంగా రూ. లక్ష రూపాయలు నగదు అందజేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రజల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించటానికి విద్యార్థుల్లో సృజనాత్మకతను ప్రోత్సహించే లక్ష్యంతో విజ్ఞాన కేంద్రం నిర్మాణం జరుగుతుందన్నారు. పల్నాడు సంస్కృతి సంప్రదాయాలు చరిత్రకు అనుగుణంగా భవిష్యత్ తరాలుకు తెలియజేయటం అభ్యుదయ భావాలు శాస్త్రీయ ఆలోచన విధానాన్ని పెంపొందించటం కోసం విజ్ఞాన కేంద్రం ఏంతోగానో దోహదపడుతుందన్నారు. పల్నాడు జిల్లా విజ్ఞాన కేంద్రం ట్రస్టు చైర్మన్ గుంటూరు విజయ్‌కుమార్ మాట్లాడుతూ కళలు సంస్కృతి శాస్త్రీయ ఆలోచన విధానంతో పాటు సేవా కార్యక్రమాలు నిర్వహణ విజ్ఞాన కేంద్రం లక్ష్యంమన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పార్టీ మండల కార్యదర్శి కె.వి.ఆర్.మోహన్‌చందు, సీఐటీయూ మండల కార్యదర్శి భువనగిరి వెంకటేశ్వర్లు, జిల్లా యువజన సంఘం నాయకులు వెంకటేశ్వర రాజు, సూరబత్తుని గోవిందు పాల్గొన్నారు.

శిక్షణ కార్యక్రమం, వంటల పోటీలు



విజేతలకు బహుమతులు అందచేస్తున్న ఎంఈఓ సయ్యద్ జఫ్రూల్లా, న్యాయనిర్ణేతలు

వినుకొండ టౌన్: గోరుముద్ద మధ్యాహ్న భోజన పథకం నిర్వాహక కుక్‌లు, హెల్పర్లకి ఒకరోజు శిక్షణా కార్యక్రమాన్ని వంటల పోటీలను పట్టణంలోని ఎంఈఓ కార్యలయంలో శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంఈఓ సయ్యద్ జఫ్రూల్లా, డీఆర్‌పీ భారతమ్మలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హోటల్ తాజ్ మాస్టర్ కుక్‌లచే శిక్షణ తీసుకున్న డీఆర్‌పీ సూచనలతో మండలంలోని కుక్‌లు, హెల్పర్లు మరింత మెరుగ్గా, రుచిగా, శుచిగా గోరుముద్ద రోజు వారీ మెనూను వండి విద్యార్థులకు అందించాలన్నారు. కాగా వంటల పోటీలకు న్యాయ నిర్ణేతలుగా చీకటీగలపాలెం మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ జి. విజయలక్ష్మి, పీజీటి యం. మాధవిలు వ్యవహరించగా గెలుపొందిన వారికి బహుమతులను అందచేశారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన నిర్వాహకులు చేపూరి రంగారావు, సి.హెచ్.నాగరాజు, మండలంలోని అన్ని పాఠశాలల కుక్‌లు, హెల్పర్లు హాజరయ్యారు.

ఠారెత్తిస్తున్న ఎండలు



నిర్మానుష్యంగా అమరావతి మెయిన్ రోడ్డు

అమరావతి: మే నెల పూర్తయిన ఎండ తీవ్రత మాత్రం పెరుగుతోంది. పెరుగుతున్న ఉష్ణోగ్రతలను చిన్న పిల్లలు, వృద్ధులు తట్టుకోలేక పోతున్నారు. గత నాలుగు రోజులుగా మండల పరిధిలోని గ్రామాలలో ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరిగి సుమారు 44 డిగ్రీలకు పైగా నమోదు కావటం, గాలిలేక ఉబ్బతీస్తుండటంతో ప్రజలు బయటకు రావటానికే భయపడుతున్నారు. శుక్రవారం మండల కేంద్రమైన అమరావతిలో 44 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రత నమోదు కావడంతో ప్రజలు తమ వ్యక్తిగత పనులను ఉదయం పది గంటలకే ముగించుకుని ఇళ్లకు వెళుతున్నారు. తప్పనిసరి అయితే తప్ప ప్రజలు ప్రయాణాలు కూడా చేయడం లేదు. మండల కేంద్రమైన అమరావతికి చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రతి రోజు సుమారు నాలుగైదు వేల మంది వివిధ పనులపై వచ్చి వెళుతుంటారు. ప్రస్తుత ఎండ వేడిమికి అమరావతికి వచ్చే సందర్శకుల సంఖ్య కూడా గణనీయంగా తగ్గింది. వైద్యులు కూడా ఎండలో తిరగవద్దు అని హెచ్చరిస్తుండటంతో ప్రజలు పెద్దగా కనిపించక రోడ్లు నిర్మానుష్యంగా తయారయ్యాయి.